


(ఫొటో: బి. పి. రెడ్డి, మాడల్ : ఇంద్రాణి)

ఇస్లామియా ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు బస్సు దిగాను. నాతోపాటు దిగిన మరి కొందరు తొందరతొందరగా నడి వెళుతున్నారు.

నన్ను దించిన బస్సు- ఎక్కేవాళ్ళు పూర్తిగా ఎక్కకుండానే హారన్‌కొడుతూ ముందుకు వెళ్ళిపోయింది.

క్రొత్త వాతావరణం, కొత్తమనుషులు, కొత్త ప్రదేశం కావడం మూలంగా, నేను ఎటువైపు వెళ్ళాలో? ఎవరినీ అడగకుండానే ముందుకు నడవసాగాను అటూ, యిటూ చూసుకుంటూ.

ఆఫీసులకు, ఫ్యాక్టరీలకు, స్కూళ్ళకు వెళ్ళే వాళ్ళ మూలంగా రోడ్డు రద్దీగా ఉంది, బస్సులు రిక్షాలు, కార్లు పోటీలుపడి పరుగెడుతున్నాయి.

ఇంకా ముందుకు నడవడం ఆపి, రామం రాసిన వుత్తరంతీసి మరోసారి చదువుతున్నాను.

"ప్రియమైన మిత్రుడు వాసుదేవరావుకు, నా నమస్కారములు. నేను చెప్పిన అమ్మాయినే పెళ్ళిచేసుకుంటానన్నందుకు. యింత కాలానికి నీవు ఒక నిర్ణయానికి వచ్చినందుకు చాలా సంతోషం. అమ్మాయి అందంగా వుంటుంది. యిద్దరు తమ్ముళ్ళున్నారు. తండ్రి లేడు. చాల గౌరవంగా బ్రతుకుతున్న కుటుంబమని చెప్ప వచ్చు. నీగురించి అన్ని వివరాలు చెప్పాను. త్వరగా వెళ్ళి చూసివచ్చిన వెంటనే వుత్తరం రాయగలవు.

ఇట్లు, నీ శ్రేయోభిలాషి,
రామం."

రామం, నేను కలిసి చదువుకోకపోయినా మంచి స్నేహితులం. మాయిద్దరి అభిప్రాయాలు అభిరుచులు ఒకేవిధంగా వుండటం మూలంగా చాల దగ్గరి స్నేహితులమయ్యాము. ఏదిచేసినా, ఎటు వెళ్ళినా కలిసినపుడు మాత్రం అన్ని విష యాలు ఒకరికొకరము చెప్పుకొని విడిపోయే వాళ్ళం. యిద్దరం చేసేది ఒకేరకమైన ఉద్యో గమే అయినా, వేరువేరు ప్రదేశాల్లో ఉంటున్నాం కాబట్టి కలుసుకోవడం చాలా అరుదుగా జరిగేది. యిప్పుడు అన్నివిషయాలు ఉత్తరాలద్వారానే "బట్వాడ" అవుతున్నాయి.

నాపెళ్ళి విషయములో ఖచ్చితమైన నిర్ణ యాలు లేకపోయినా, ఇప్పటికి ముగ్గురమ్మా యిల్ని చూశాను. ఒకసారి అమ్మకు నచ్చక పోవడం, ఒకసారి నాన్నకు నచ్చకపోవడం, మరోసారి అమ్మాయి తలిదండ్రులకు నచ్చ కుండా పోయాయి. 'ఏదైనా నేనే నిరయం చేసుకుంటాను' అని అమ్మకు చెప్పి అమ్మాయి కొరకు చూస్తుండగానే రామందగ్గర్నుండి ఈ వుత్తరం వచ్చింది. రామం ఏనిర్ణయం చేసినా నేను పాటిస్తాను. వాడిమీద నాకంత నమ్మక ముంది. ఆలోచించకుండా వాడేపని చేయడు. వాడు చేసే పతి పని ఒక ప్రత్యేకత సంత రించుకుని వుంటుందని నాకేకాదు, వాడినెరిగిన ప్రతివాడికీ తెలుసు.

"ఏమండీ!"

ఆ పిలుపుతో కాళ్ళు నడకను ఆపాయి. ఆలోచనలకు ఆనకట్టపడ్డది. యింతసేపు చేతు లలో నలిగిపోయిన వుత్తరం జేబులోకిపోయింది. వెనుకకు తిరిగి చూశాను. ఎదురుగా ఎవ్వరూ కనిపించలేదు. అయినా ఈఅపరిచిత ప్రదేశంలో నన్నెవరుపిలుస్తారు? ముందుకు నడిచాను.


మళ్ళీ అదేపిలుపు. మళ్ళీ ఆగాను. మళ్ళీ వెనుకకు తిరిగిచూశాను. మళ్ళీ నడిచాను.

సందేహంలేదు. పిలిచేది నన్నే! అందులో ఆడగొంతు! ఆగి ప్రక్కకు తిరిగి చూశాను. దగ్గరగావస్తోంది. చకచక నడిచివస్తోంది. రోడ్డుకిరువైపుల ఎంతోమంది జనం వెళ్తుండగా వాళ్ళెవ్వర్నీ పిలవకుండ నన్నే ఎందుకుపిలవాలి?

---

ఆమె తలవంచుకుని ముందు నడుస్తున్నది. నేను వెనుక ఆలోచిస్తూ నడుస్తున్నాను. అంత అందమైన అమ్మాయి వెనక నడవడం నాకు చాలా గర్వమనిపించింది. ఆమె నడుస్తోంది. నడుస్తూ, నడుస్తూ ఆగుతోంది. ఆగి....

---



నాదగ్గరికే ఎందుకురావాలి? నేను ఈ 'సిటీ'కి కొత్తవాణ్ణని చెప్పి పసిగట్టి పిలిచిందేమో!

దగ్గరకువచ్చి "మీ సహాయం కావాలి." ధైర్యంగా అడిగింది.

ఎటువంటి సహాయంచేయవల్సి వస్తుందోనని మనస్సు సందేహిస్తున్నా "ఏం కావాలి?" అని అడిగాను ఏదైనా చేయాలనే ధీమాతో.

"మీరు నావివరాలు ఏమి అడగకూడదు. నాతోపాటు వచ్చి మీరు నా అన్నయ్యగా సంతకం పెట్టాలి. అంతకుమించి మిమ్మల్ని ఏమి కోరను"

ఆమె అభ్యర్ధనలో దీనత్వముంది. నా సంతకముతో చాలా మేలు జరుగుతుందని ఆమె మాటలే చెబుతున్నా, నాకు అనుమానంవేసి "సంతకం ఎక్కడ చేయాలి? నా సంతకంవల్ల నీకు కలిగే లాభం?" అడిగాను.

"ఇక్కడికి దగ్గరే ఒక ఆఫీసుంది. మీరు నా అన్నగా సంతకం చేస్తే నాకు రెండొందల రూపాయలొస్తాయి. ఆ రూపాయలతో మా కుటుంబజీవనం ఒకనెల గడిచిపోతుంది. అంతే"

అప్పుడర్ధమయింది ఆమె కుటుంబం ఎటువంటి పరిస్థితుల్లో వుందో! ఆమె తీసుకువెళ్ళే ఈ రూపాయలమీదే ఆ కుటుంబం ఆధారపడి వుంది. ఆమె తన కుటుంబంకోసం కష్టపడుతున్నట్టు తేలింది. కుటుంబ బాధ్యతలు ఆమె మీదనే ఆధారపడి వున్నాయని వూహించి సంతకం చేయాటానికి ఒప్పుకున్నాను.

ఆమె తలవంచుకుని ముందు నడుస్తున్నది. నేను వెనుక ఆలోచిస్తూ నడుస్తున్నాను. అంత అందమైన అమ్మాయి వెనక నడవడం నాకు చాల గర్వమనిపించింది. ఆమె నడుస్తోంది, నడుస్తూ, నడుస్తూ ఆగుతోంది. ఆగి వెనుకకు తిరిగి చూస్తోంది నేను వస్తున్నానో లేదోనని.

ఆమె అందంగా వుంది. ఆమె ఆరోగ్యంగా వుంది. ఆమె దృఢంగా వుంది. ఆమె చురుకుగా కన్పిస్తోంది. ఆమె చకచకా నడుస్తోంది. నడుస్తూ నడుస్తూ వెనుదిరిగి చూస్తోంది.

కొంత దూరం నడిచాక ఒక ఆఫీసులోకి పోయింది. నేను ఆమె వెనుకే నడిచాను. లోపలికి వెళ్ళాక విచారించాను, ఆఫీసుబోర్డు చదవకుండానే లోనికి ప్రవేశించినందుకు.

నేను సంతకం చేయడం అయిపోగానే ఐదు నిమిషాలు బయట నిలబడమని చెప్పిందామె. బయటికి వచ్చి బోర్డు చదువుకున్నాను గాని, ఆమె ఈ ఆఫీసులో ఏంపని చేస్తుందో ఊహ కందడం లేదు.

ఆమె ఈ ఆఫీసులో చేసేపని ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం క్షణ క్షణానికీ పెరగసాగింది. అక్కడ కన్పించిన వాచ్‌మన్‌ని సమీపించి "ఇప్పుడు లోపలికి వెళ్ళిన అమ్మాయి ఈ ఆఫీసులో ఏం పనిచేస్తుంది?" అని అడిగాను.

"పర్మినెంటు పనేదిలేదు బాబు. వాళ్ళకు ఈ అమ్మాయి ఫోటోలు కావాలి. ఈమెకు వాళ్ళిచ్చే డబ్బు అవసరం. ఈ పట్టణంలో ఒక్కొక్కరి జీవితం ఒక్కోరకంగా వుంటుంది. బట్టలున్న ఫోటోలయితే బాగానే వుండేదిబాబు. బట్టలు విడిచి ఫోటోలు తీస్తారు"

అతని మాటలు వేదాంతివిలా వున్నా, నిజం లేకపోలేదు. ఆమె జీవితం తలుచుకునే సరికి యిక అక్కడ నిలబడలేక పోయాను. అంత అందంగా వుండీ ఈపని చేస్తోందా? నమ్మలేక పోయాను.

ఆమెను విడిచి చాలా దూరం వచ్చినా ఆమెను గురించిన ఆలోచనలు నన్ను విడవకుండా వున్నాయి. ఆమె అలాచేస్తున్నందుకు నాకు చాలా బాధ కలిగింది. కాని, ఆమె యిలా చేయడానికి కల్పించబడ్డ పరిస్థితుల గురించి ఆలోచించలేదు. అది ఒక ఫోటోగ్రఫీ ట్రైనింగ్ కాలేజీ. ఒక వస్తువును నగ్నంగా వివిధ భంగిమలలో ఫోటోలు తీసి వాళ్ళ కళానైపుణ్యాన్ని వాస్తవ చిత్రీకరణను ప్రదర్శించి డిగ్రీలు సంపాదిస్తారు. కాని ఈ అమ్మాయిని గురించి ఎవరూ ఆలోచించరు. పట్టించుకోరుకూడ. ఈ విధంగా జరగడం "సిటీ"లో మామూలే! ఎదుటివాళ్ళ బాధలను పట్టించుకోక పోవడం "సిటీ" నేర్పిన నాగరికత. యింకా ఆమెగురించి ఆలోచించకుండా నేను వెళ్ళవలసిన అడ్రసు గురించి నలుగుర్ని అడిగాను. నలుగురు నాలుగు రకాలుగా చెప్పారు. అటు తిరిగి, యిటుతిరిగి ఆ మలుపు, ఈ మలుపు తిరిగి చేరవలసిన యింటికే చేరాను. మధ్యాహ్నం దాటిపోయింది.

చిన్న గల్లీలో వున్న చిన్న ఇల్లు అది. అంత పెద్దది కాకపోయినా, మరీ అంత చిన్నది కాదు. నేను ఆ యింటికి వెళ్ళేసరికి యిద్దరు పిల్లలు అరుగుమీద కూర్చుని చదువుకుంటున్నారు.

రామం పంపించాడని చెప్పగానే ఆయింటి యజమాని నన్ను లోపలికి ఆహ్వానించింది. యింతసేపూ నిశ్శబ్దంగా చదువుకుంటున్న పిల్లలు లేచివచ్చి, నా వెనుక నిలబడి వింతగా చూస్తున్నారు. ఇంతలో ఆమె నీళ్లు తెచ్చి యిచ్చింది

కాఫీ త్రాగి కుర్చీలో కూర్చున్నాను

"మి గురించి రామం చాలా చెప్పాడు. మా యింటి పరిస్థితులను గురించి కూడ మీకు చెప్పే వుంటాడు. చాల చిన్నకుటుంబమే అయినా బీద కుటుంబం. అమ్మాయి చదువుకున్నా ఉద్యోగం లేదు. అంతగా లేకపోయినా ఆత్మాభిమానం కలవాళ్ళం. అమ్మాయి ప్రస్తుతం బటలషాపులో పనిచేస్తోంది. దాని జీతం మీదనే మా జీవితాలు ఆధారపడి వున్నాయి. అమ్మాయిని నీకు యిచ్చి పెళ్ళిచేస్తామేతప్ప, నీ చేతుల్లో ఏమి పెట్టలేని నిర్భాగ్యులం.'

చెప్పడం ఆపి కన్నీళ్ళు కార్చిందామె. ఆ కన్నీళ్ళను చూడలేక పోయాను. ఆడపిల్లలను కన్న ప్రతి తలిదండ్రులకు చివరకు మిగిలేది ఈ కన్నీళ్ళేనేమో!

ఆమెకు ఉపశమనం కల్పించాలనే ఉద్దేశ్యంతో "మిరేమి బాధపడకండి! మీ నుండి నేనేమీ ఆశించను. నాకు చేతనైన సహాయం చేస్తాను. రామం అన్ని విషయాలు ముందే వివరించాడు. దిగులు పడకండి" అన్నాను సానుభూతితో


నేను అన్నమాటలతో ఆమె కళ్ళలో వేయి కాంతులు వెల్లి విరియలేదుగాని, ప్రశాంతత ఏర్పడ్డది. వెనుకనిలబడి, మా సంభాషణ విన్న పిల్లల ముఖాలలో జ్యోతులు వెలిగాయి

"అదిగో అమ్మాయి వస్తూంది." అంది ఆమె గుమ్మంవైపు నడుస్తూ. నేను ఆతురతతో అటు వైపుచూశాను. పిల్లలు నాప్రక్కచేరి 'బావ దగ్గర నిలబడ్డాం' అన్నట్టుగా అక్కరాక వైపు ఫోజు యిచ్చారు.

ఆఁ...... ఆఁ...... ఆమె వచ్చింది. నన్ను చూసి తెల్లపోయింది. నేను ఆమెనుచూసి స్థాణువులా నిలబడి పోయాను. ఆమె తల్లి ఆశ్చర్యపోయి చూస్తోంది. పిల్లలు వింతగా చూస్తున్నారు. సందేహంలేదు ఆ అమ్మాయే ఈ అమ్మాయి! నేను వస్తూండగా దారిలో కలిసిన అమ్మాయే. నాతో తన అన్నయ్యగా సంతకం చేయించుకున్న అమ్మాయే!

ఆ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ. నా గురించి ఆమెకు చెబుతోంది తల్లి.

ఎక్కడికో దూరతీరాలకు మనస్సు పరుగులు తీయుటకు సిద్ధపడింది. పరిస్థితుల సాలెగూడులో చిక్కుకున్న మెదడు పరిష్కారము ఆలోచలేక మొద్దుబారిపోయింది. ఆ వాతావరణంలో నిలబడలేక, వాళ్ళ మధ్యన వుండలేక, ఆమెముందు ఏమి చెప్పుకోలేక బయటపడ్డాను- గిలగిల తన్నుకుని వలనుండి బయటపడ్డ చేపలా. ❋



తుఫాన్

తుఫాను రానున్నదనే హెచ్చరిక విని ఓ దంపతులు వాళ్ళబ్బాయిని ముందు జాగ్రత్త చర్యగా ఓ చుట్టం ఇంట్లో దిగ విడిచి వచ్చారు.

రెండ్రోజుల్లోనే ఆ చుట్టపాయన టెలిగ్రాం ఇచ్చాడు. "వెంటనే మీఅబ్బాయిని తీసికెళ్ళండి. లేదా నేనే అక్కడి కొచ్చేసి ఆ తుఫానేదో భరిస్తాను."

—సుషమ (మద్రాసు)

